ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
సోమవారం 17 ఫిబ్రవరి 2025 | 5

ఎమ్మెల్సీ పోలింగ్‌కు యంత్రాంగం కసరత్తు

- ఆరు జిల్లాల్లో 2వేలకు పైగా సిబ్బంది ఎన్నికల విధుల్లో ..
- ఈనెల 22న తుది విడత శిక్షణ

7లో



జొన్నాడ, యానాం ఏటిగట్టుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రూ.70 లక్షలతో జొన్నాడ-యానాం ఏటిగట్టు పనులు



కపిలేశ్వరపురంలో దెబ్బతిన్న ఏటిగట్టు

మండపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జొన్నాడ, యానాం మధ్య ఉన్న ఏటిగట్టు రోడ్డుకు రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.70 లక్షలతో తారురోడ్డు పనులు చేపట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారిగా ఏటిగట్టు రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు వాహనదారులు కాస్తంత ఊరట చెందుతున్నారు. కొత్తపేట, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం నియోజకవర్గంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం యానాంతో కలుపుకుంటే ఐదు నియోజకవర్గాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ధవళేశ్వరం గౌతమి సబ్ డివిజన్ పరిధిలో ఉండే జొన్నాడ నుంచి యానాం వరకు ఉన్న ఏటిగట్టు 42 కిలోమీటర్ల మేర ఉంది. మరమ్మతుల పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. జొన్నాడ జాతీయ రహదారి 216 నుంచి ప్రారంభమై యానాం జాతీయ రహదారి 214ను కలుస్తుంది. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో గల నాలుగు కిలోమీటర్లు, మండపేట నియోజకవర్గ పరిధిలో 10 కిలోమీటర్లు, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో 21 కిలోమీటర్లు, ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో 4 కిలోమీటర్ల మేర గోతులమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మొత్తం నాలుగు నియోజకవర్గాల పరిధిలో రూ.70 లక్షలతో తారురోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో కనీస మరమ్మతులకు నోచుకోని ఏటిగట్లు ఆధునికీకరణ పనులు చేపట్టడంపై ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రైతులు ఊరట చెందుతున్నారు.

మార్చి 8 వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విరామం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ జిల్లాలో అమలులో ఉన్న కారణంగా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి మార్చి 8 వరకు ప్రతీ సోమవారం కలెక్టరేట్, మూడు రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామన్నారు. మీ కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో అర్జీదారులు తమ సమస్యలను రాత పూర్వకంగా నమోదు చేసుకోవచ్చునని లేదా సమీప గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్ అర్జీలు నమోదు చేయించుకోవచ్చునని కలెక్టర్ సూచించారు.



ఉప్పలగుప్తం మండల శివారు కూనవరం డ్రెయిన్ సముద్రంలో కలిసే ప్రదేశం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

- కూనవరం స్ట్రెయిట్‌కట్ పునరుద్ధరణ టెండర్లలో 'మెలిక'
- లాంగ్‌స్టిక్ లాంగ్‌బూమ్ ధ్రువీకరణ తప్పనిసరి
- రూ.3.16 కోట్ల అంచనాతో కూనవరం స్ట్రెయిట్‌కట్‌కు టెండర్లు
- మొదటి టెండరులో ఆ నిబంధన 'డిలీట్'
- అదే నిబంధనతో మళ్లే రెండోసారి టెండర్లు పిలిచిన అధికారులు
- ఇరిగేషన్‌శాఖలో తిష్టవేసి చక్రం తిప్పుతున్న అధికారులు, వైసీపీ కాంట్రాక్టర్లు
- టెండర్ల ప్రక్రియపై న్యాయస్థానానికి ఇరిగేషన్ కాంట్రాక్టర్లు

రూ.కోట్ల పనులకు టెండర్ పెట్టేద్దామని..



లాంగ్‌స్టిక్ డ్రెడ్జింగ్ చేసే యంత్రం (ఫైల్ ఫొటో)

వారి కోసం టెండర్లు

ఇరిగేషన్ శాఖలో జరుగుతున్న కాంట్రాక్టు పనులకు సంబంధించి టెండర్ల నిబంధనను తమకు అనుకూలంగా మార్చుకుని కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు పనులు చేజిక్కించుకునేందుకు గత వైసీపీ ప్రభుత్వంలో కరుడుగట్టిన కాంట్రాక్టర్లుగా పేరొందినవారే కూటమి ప్రభుత్వంలోను చక్రం తిప్పుతున్నారు. అధికార యంత్రాంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని టెండర్ల ప్రక్రియలో ఇతర కాంట్రాక్టులెవరూ భాగస్వాములు కాకుండా తమకే వచ్చేలా ప్రణాళికలు పన్నుతున్నారు. దీనిపై మిగిలిన కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రసన్నం చేసుకుని వారి సహకారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లేని నిబంధనలను టెండర్లలో సృష్టించి పనులు చేజిక్కించుకోవాలనే కొందరు చేస్తున్న కుట్రపై మిగిలిన కాంట్రాక్టర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారని విశ్వసనీయ సమాచారం. ఇందుకు కూనవరం స్ట్రెయిటకట్ పునరుద్ధరణ కాంట్రాక్టు పనులు కారణమవుతున్నాయి. ఒక నిబంధనను సాకుగా చూపి టెండర్లు పిలిచిన అధికారులు కాంట్రాక్టర్ల ఒత్తిడితో ఆ నిబంధనను టెండరు షెడ్యూల్ నుంచి 'డిలీట్' చేశారు. అయితే మళ్లీ అదే నిబంధనతో ముందు టెండర్లను రద్దుచేసి ఐదు రోజుల కాలపరిమితితో మరో టెండరును విడుదల చేయడం వెనుక రాజకీయ పరమైన ఒత్తిళ్లు ఉన్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మొదటి టెండర్‌లో 'డిలీట్'.. మళ్లీ టెండరులో అదే నిబంధన..!

కపిలేశ్వపురం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల టెండర్ల విషయంలో నిబంధనలు కాంట్రాక్టర్లకు అనుకూలంగా పెట్టి పనులు అప్పగిస్తున్నారన్న ఆరోపణలు ఇటీవల కాలంలో వినిపిస్తున్నాయి. ఇందుకు ఆ శాఖలోని కీలక అధికారులు మామూళ్ల మత్తులో కొందరు అనుకూల కాంట్రాక్టర్లకు సహకారం అందిస్తున్నారని ప్రధాన అభియోగం. కోనసీమ జిల్లా పరిధిలోని ఉప్పలగుప్తం మండలం కూనవరం డ్రెయిన్ సముద్రపు మొగలో కలిసే ప్రాంతమైన కూనవరం స్ట్రెయిట్‌కట్ పనులు చేపట్టేందుకు ఇరిగేషన్‌శాఖ రూ.3.16 కోట్ల అంచనా వ్యయంతో డ్రెడ్జింగ్ పనులు చేపట్టేందుకు తొలుత టెండర్లను పిలిచారు. వాటి గడువు ఫిబ్రవరి 11 వరకు విధించారు. ఆరు నెలల కాలపరిమితితో కూనవరం మొగ 0.60 కిలో మీటరు నుంచి 2.00 కిలోమీటరు వరకు మొగ పునరుద్ధరణకు 21,150.00 క్యూబిక్ మీటర్ల ఎర్త్‌వర్క్ చేసేందుకు తొలుత టెండర్లు పిలిచి 12వ తేదీ వరకు గడువు విధించారు. కానీ ఈ టెండర్లకు అర్హత నిబంధనను ఒకటి సాకుగా చూపారు. ఎర్త్ వర్క్ చేసేందుకు లాంగ్‌స్టిక్ లాంగ్‌భూమ్ ఎక్విప్‌మెంట్ ఖచ్చితంగా ఉండాలని ఈ యంత్రాలతో గతంలో పనిచేసిన అనుభవానికి సంబంధించి ఎస్ఈ లేదా ఈఈ స్థాయి అధికారి ఇచ్చే ధ్రువీకరణపత్రం తప్పనిసరిగా జత చేయాలని తొలుత జారీ చేసిన టెండర్లలో నిబంధనగా విధించారు. అసలు ఎస్ఎస్ఆర్‌లో లేని ఈ నిబంధన ఇక్కడ ఎలా వర్తింప చేస్తున్నారంటూ కాంట్రాక్టర్లు ఇరిగేషన్ ఉన్నతాధికారులను ప్రశ్నించడంతో దానిపై స్పందించిన ఒక కీలక అధికారి ఆ నిబంధనను టెండరు షెడ్యూలు నుంచి వెంటనే డిలీట్ చేశారు. ఆ తర్వాత వైసీపీకి చెందిన ఒక కీలక కాంట్రాక్టరు కూటమి ప్రభుత్వంలోని కీలక పెద్దల సహకారంతో సదరు ఇరిగేషన్ ఉన్నతాధికారిపై ఒత్తిడి తెచ్చారు. దాంతో మళ్లీ ఐదు రోజుల కాలపరిమితితో అదే నిబంధన విధించి రెండోసారి టెండర్లు పిలిచారు. ఈ నెల 10వ తేదీ నుంచి పిలిచిన తాజా టెండరు షెడ్యూల్‌కు సంబంధించి గడువును వారం రోజులు విధించారు. ఈ నెల 17వ తేదీ సోమవారం టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేయనున్నారు. అయితే ముందు టెండర్‌లో లాంగ్‌స్టిక్ నిబంధనను తొలగించిన అధికారి రెండోసారి విడుదలచేసిన టెండర్‌లో మళ్లీ లాంగ్‌స్టిక్ లాంగ్‌బూమ్ విధించడం వెనుక ఉన్న కుట్ర కోణంపై జిల్లాలోని కొందరు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్ఎస్ఆర్ రేట్లలోని ఈ లాంగ్‌స్టిక్ నిబంధన ఎంత సామర్థ్యం కలిగిన యంత్రంతో పనిచేయాలనే నిబంధన కూడా పెట్టకుండా క్యాజువల్ నారమ్స్ పెట్టి టెండర్లను చేజిక్కించుకునేందుకు వైసీపీ ముసుగులో ఉన్న కాంట్రాక్టర్లు చేస్తున్న వ్యవహారంపై విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కూడా కోరనున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు చేస్తున్న నిబంధన ఉల్లంఘనపై కోర్టును ఆశ్రయించడం ద్వారా కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు ఇరిగేషన్ శాఖలో ఈ తరహా వ్యవహారాల్లో నిమగ్నమైన అధికారుల పనితీరుపై విచారణ జరిపించాలని కోరేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు ఒక కీలక కాంట్రాక్టరు ఆంధ్రజ్యోతికి చెప్పారు. నిధులను దుర్వినియోగం చేసే క్రమంలో కొందరు ప్రజాప్రతినిధుల సహకారంతో ఇరిగేషన్ శాఖలో చక్రం తిప్పుతున్న వైసీపీ కాంట్రాక్టరుపై చర్య తీసుకోవాలనే అంశంపై ఇప్పటికే రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దృష్టికి ఈ వ్యవహారం మొత్తాన్ని తీసుకువెళ్లినట్టు తెలిసింది. అయితే కూనవరం స్ట్రెయిట్‌కట్ పునరుద్ధరణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ రాజకీయ గందరగోళంగా మారే పరిస్థితులు ఉన్నాయి.



నష్టాలు హోల్‌సేల్‌గా..

మడికి మార్కెట్‌లో దిగజారుతున్న ధరలు
ఆందోళనలో కూరగాయల రైతులు

ఆలమూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): హోల్‌సేల్‌గా కూరగాయల ధరలు దిగజారడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కోసారి కోత, రవాణా చార్జీలు కూడా రావడం లేదని వాపోతున్నారు. కూరగాయల పంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని లంక భూములు ప్రసిద్ధి. శ్రేష్ఠమైన లంక మట్టిలో ఏ రకమైన కూరగాయలు సాగు చేసినప్పటికీ మంచి దిగుబడులు వస్తాయి. దీంతో లంక భూములలో కూరగాయల సాగు అధికంగానే జరుగుతుంది. అయితే ఒక్కోసారి దిగుబడులు అంతంత మాత్రంగానే ఉంటాయి. అప్పుడు ధరలు మాత్రం అధికంగా ఉంటాయి. అయితే మరోసారి దిగుబడులు అధికంగా ఉండి ధరలు అమాంతం పడిపోతాయి. ప్రస్తుతం. డా.బీఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్లో గత వారం రోజులుగా కూరగాయల ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కొన్ని రకాల పంటలకు కనీసం కోత కూలీలు, రవాణా చార్జీలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా హోల్‌సేల్‌లో ధరలు ఒకసారిగా పడిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే రిటైల్‌లో మాత్రం కూరగాయల ధరలలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. రిటైల్ మార్కెట్‌లో ధరలు మండుతూనే ఉన్నాయి. కూరగాయలు తగ్గాయని అంటున్నారే కాని వినియోగదారునికి మాత్రం ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కూరగాయలు	పది కిలోలు
1. వంకాయలు	రూ.80నుంచి150
2. బెండ	రూ.350
3. దొండ	రూ.150
4. టమోట	రూ.80
5. కాకర	రూ.200
6. పచ్చిమిర్చి	రూ.140
7. పచ్చిమిర్చిసన్నాలు	రూ.160
8. ఆనబకాయ(ఒకటి)	రూ.8
9. బీరకాయలు	రూ.400
10. క్యాలీఫ్లవర్(ఒకటి)	రూ.5
11. అరటికాయ(ఒకటి)	రూ.3
12. దోసకాయలు	రూ.100

అర్హులైన రైతుల సంక్షేమ లబ్ధికి కొత్తగా భూ ఆధార్ నమోదు

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



బోసుబాబు

అమలాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని రైతులకు నేరుగా వర్తింపచేసేందుకు కొత్తగా భూ ఆధార్-ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు ఆదివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం ద్వారా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ నమోదు చేస్తున్నారన్నారు. దీని ద్వారా పీఎం కిసాన్ చెల్లింపు పెట్టుబడి సాయం, పంటల బీమా, దిగుబడుల విక్రయాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, పంట రుణాలు, వడ్డీ రాయితీ, సూక్ష్మ సేద్యంపై రాయితీ వంటి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. భూ ఆధార్ ఉన్న వారికి మాత్రమే పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తింప చేస్తారన్నారు. భూమి ఉన్న ప్రతీ రైతు ఆధార్ నంబరు, అనుసంధానిత ఫోన్ నంబరు, కొత్త పట్టాదారు పాసు పుస్తకం తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ఈ నెల 25లోగా నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతీ రైతు అశ్రద్ధ చేయకుండా భూ ఆధార్ పొందాలని కోరారు. రెవెన్యూ అధికారులు భూ ఆధార్‌ను ధ్రువీకరించిన అనంతరం వాటి ఆధారంగా విశిష్ట భూ ఆధార్ కార్డు జనరేట్ అవుతుందన్నారు. ఆధార్ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు పత్రం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. సాగు భూమి ఉన్న ప్రతీ రైతుకు పదకొండు అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పత్రం జారీ ప్రక్రియ జిల్లాలో ఇటీవల ప్రారంభమై ఈ నెల 25 వరకు కొనసాగుతుందన్నారు. భూ ఆధార్ నమోదు సమయంలో భూ యజమాని సెల్‌ఫోన్‌కు మూడు ఓటీపీలు వస్తాయని, అనంతరం రైతు ఇచ్చిన సెల్ నంబరుకు పదకొండు అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. భూ ఆధార్ లేకుంటే ప్రభుత్వం అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు, రాయితీలు అందవని స్పష్టం చేశారు. జిల్లాలో 1.65 లక్షల మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 48 వేల మంది రైతులు పోర్టల్‌లో భూ ఆధార్ కోసం నమోదైనట్టు వ్యవసాయాధికారి బోసుబాబు తెలిపారు.

పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

- మొదటి ప్రాధాన్య ఓటుతో పేరాబత్తులను గెలిపించాలి
- రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్
- జనసేన గోదావరి జిల్లాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపు నిచ్చారు. జనసేన గోదావరి జిల్లాల ప్రతినిధులతో స్థానిక చెరుకూరి కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి వారిద్దరూ విచ్చేసి మాట్లాడారు. సమన్వయంతో ముందుకు వెళ్లాలని, మొదటి ప్రాధాన్య ఓటుతో పేరాబత్తులను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా రాజశేఖరంను మరోసారి అందరికీ పరిచయం చేశారు. సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, పంతం నానాజీ, పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్యులు పాల్గొన్నారు.

మహాకుంభ మేళాకు ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మహాకుంభ మేళా యాత్రకు వెళ్లే భక్తుల కోసం అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు డిపో నుంచి బస్సులు బయలు దేరతాయని, ఎనిమిది రోజుల పాటు జరిగే యాత్రలో భాగంగా భువనేశ్వర్, పూరీ, కోణార్క్, ప్రయాగరాజ్, కుంభమేళా, వారణాసి, అయోధ్య, గయా, బుద్ధగయ, అరసవిల్లి, శ్రీకూర్మం, త్రివేణి సంగమ స్నానం, విశ్వనాథ దర్శనం జరుగుతాయన్నారు. ప్రయాగ్‌రాజ్‌తో పాటు కాశీ క్షేత్రాల్లో ఒకరోజు బస చేసే అవకాశం ఉంటుందని ప్రయాణికులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందించనున్నట్లు చెప్పారు. టిక్కెట్ ఒక్కటి రూ.10,800 ధర నిర్ణయించినట్టు డిపో మేనేజర్ తెలిపారు. మహాకుంభ మేళాకు వెళ్లే భక్తులు రిజర్వేషన్ సౌకర్యం కోసం అసిస్టెంట్ మేనేజర్ సెల్ 7013868687, 9959225576 ను సంప్రదించాలన్నారు.

గొల్లప్రోలులో యువకుడి కిడ్నాప్

పిఠాపురం తీసుకువెళ్లి బీరుబాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి
సిగరెట్లతో కాల్చి చిత్రహింసలు

7లో



టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు

రెండో రోజు హోరాహోరీ

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ రెండో రోజైన ఆదివారం హోరాహోరీగా సాగింది. ఆర్ఎస్బీ హైదరాబాద్, ఆర్ఎస్బీ ముంబై, ఆర్ఎస్బీ రాయ్‌పూర్, ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, తెలంగాణ, ఢిల్లీ సెక్రటేరియట్, ఒడిశా సెక్రటేరియట్, మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి. సాయంత్రం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల్లో శ్రీకృష్ణ కోలాటం ఎంతో ఆకట్టుకుంది. శ్రీభరత్ లిఖిత ఆర్కెస్ట్రా, ఆర్ టెక్నో రాక్ బ్యాండ్ క్రీడాకారులకు వినోదాన్ని పంచాయి.



ఆకట్టుకున్న కోలాటం

వివరాలు 7లో...

సత్యదేవుడి సన్నిధిలో

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పూజలు



సుప్రీంకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి చిత్రపటం అందజేస్తున్న ఈవో, సత్యదేవుడి దర్శనానంతరం హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి

అన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వేర్వేరుగా స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్లసుబ్బారావు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతంపలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

2025-26కి రూ. 162.55 కోట్లతో

అన్నవరం ఆలయ అంచనా బడ్జెట్

అన్నవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ఆలయానికి సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1625525000 అంచనా ఆదాయం వస్తోందని లెక్కించారు. అయితే వ్య యానికి సంబంధించి రూ.1621325000 వ్యయంగా అంచనా వేశారు. ఆదాయానికి సంబంధించి వ్రతాల ద్వారా రూ.50కోట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.40కోట్లు, లీజుల విభాగం ద్వారా రూ.15 కోట్లు, సత్రంగదుల అద్దెల ద్వారా రూ.10కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీలద్వారా రూ.6కోట్లు అంచనా ఆదాయంగా లెక్కించారు.

వ్యయాలకు సంబంధించి ప్రధానంగా ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, శానిటేషన్ నిర్వహణ, రసవర్గాలు కొనుగోలుకు నెలకు రూ.12 కోట్లు ఖర్చుచేయాల్సి ఉండగా వీటికే ఏడాదికి సుమారు రూ.140 కోట్లు వరకు వ్యయమవుతుంది. మొత్తంమీద రానున్న ఆర్థిక సంవత్సరంలో స్వామివారి ఖజానాకు సుమారు రూ.42లక్షలు మాత్రమే మిగులు బడ్జెట్‌గా అంచనా వేశారు. ఈ అంచనా బడ్జెట్ దేవదాయ కమిషనర్ ఆమోదం మేరకు హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

● డెల్టా కాలువలకు 8500 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతోంది. నీటిమట్టం తగ్గిపోతుండడంతో సీలేరు నుంచి పవర్ జనరేషన్ ద్వారా వచ్చే 4వేల క్యూసెక్కులతోపాటు నేరుగా మరో 3వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో 9.40 అడుగులకు తగ్గిన నీటిమట్టం ఆదివారం నాటికి 9.55 అడుగులకు పెరిగింది. నీటిలభ్యత 8654 క్యూసెక్కులుగా ఉండగా డెల్టాకాలువకు 850 0 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2600క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కెనరా బ్యాంకులో కొనసాగుతున్న విచారణ

● బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో గోల్డ్ అప్రైజర్‌పై కేసు నమోదు

తునిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణరైతులనే లక్ష్యంగా చేసుకుని కొదవుపెట్టిన కోటికి పై బడి బంగారాన్ని గోల్‌మాల్ చేసిన వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ఇప్పటికే ఖాతాదారులు బ్యాంకు చుట్టూ తిరుగుతూ ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంక్ అధికారులు గోల్డ్‌లోన్ వ్యవహారంలో అవకతవకలకు పాల్పడిన ముగ్గురు సిబ్బందిని సస్పెం డ్ చేసి తుని రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా తేటగుంట కెనరా బ్యాంకులో గోల్డ్ గోల్‌మాల్‌లో సూత్రధారిగా ఉన్న గోల్డ్ అప్రైజర్ రామోజీల శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తుని రూరల్ ఎస్‌ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. ఇదిలావుంటే బాధితులపక్షాన తుని ఎంపీపీ బొప్పన రాము బ్యాంకుకు చేరుకుని అధికారులతో చర్చలు జరిపారు. బంగారం కోల్పోయిన ఖాతాదారులకు ప్రస్తుత బంగారం మార్కెట్‌కు అనుగుణంగా పరిహారం చెల్లించాలని బ్యాంక్ అధికారులను కోరారు.



రెండోరోజు జోష్

● హోరాహోరీగా హాకీ టోర్నమెంట్ ● ఆర్‌ఎస్సీ హైదరాబాద్, ముంబై, రాయ్‌పూర్, చత్తీస్‌గడ్ సెక్రటేరియట్, తెలంగాణ, ఢిల్లీ, ఒడిసా, మహారాష్ట్ర జట్ల విజయం



కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 16(ఆంధ్ర జ్యోతి): కాకినాడజిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ రెండోరోజు ఆదివారం టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. తొలుత ఆర్‌ఎస్బీ హైదరాబాద్, ఆర్‌ఎస్బీ కొచ్చి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ హైదరాబాద్ 8-1తేడాతో ఆర్‌ఎస్బీ కొచ్చిపై విజయం సాధించింది. ఆర్‌ఎస్బీ చండీఘర్, ఆర్‌ఎస్బీ ముంబై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ ముంబై 5-1 తేడాతో ఆర్‌ఎస్బీ చండీఘర్‌పై విజయం సాధించింది. అలాగే ఆర్‌ఎస్బీ సిమ్లా, ఆర్‌ఎస్బీ రాయ్‌పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ రాయ్‌పూర్ జట్టు 6-2తేడాతో ఆర్‌ఎస్బీ సిమ్లాపై విజయం సాధించింది. చత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్, గుజరాత్ సెక్రటేరి యట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్ జట్టు 13-0తేడాతో గుజరాత్ సెక్రటేరి యట్ జట్టుపై విజయం సాధించింది. మధ్యప్రదేశ్, తెలంగాణ జట్లమధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 4-3తేడాతో మధ్యప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. కేరళ సెక్రటేరియట్ జట్టు, ఢిల్లీ సెక్రటేరి యట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ జట్టు 9-0తేడాతో కేరళ సెక్రటేరియట్ జట్టుపై విజయం సాధించింది. పాండిచ్చేరి సెక్రటేరియట్ జట్టు, ఒడిసా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిసా సెక్రటేరియట్ జట్టు 6-0తేడాతో పాండిచ్చేరి జట్టుపై విజయం సాధించింది. గోవా సెక్రటేరియట్ జట్టు, మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్టు 18-0తేడాతో గోవా సెక్రటేరియట్ జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న హాకీ టోర్నమెంట్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. శ్రీకృష్ణ కోలాటం బృం దం ఎంతో ఆకట్టుకుంది. అలాగే శ్రీభరత్ లిఖిత ఆర్కెస్ట్రా, ఆర్ టిక్నో రాక్ బ్యాండ్‌లు నిర్వహించిన కార్యక్రమాలు క్రీడాకారులకు ఎంతో వినోదాన్ని అందించాయి.



హోరాహోరీగా జరుగుతున్న హాకీ పోటీలు



సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

2028లో నేషనల్ గేమ్స్‌కి కాకినాడ వేదిక కావాలి



దాసరి మురళీకృష్ణ ఇన్‌కంట్యాక్స్ తెలంగాణ

1999 2001 వరకు 36 అంతర్జాతీయ టోర్నమెంట్లు ఆడారు. భారతదేశం తరుపున హాకీ టోర్నమెంటులో పాల్గొన్నా. 2028లో జరగనున్న నేషనల్ ఒలింపిక్స్‌కి ఏపీ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వాలని మొగ్గుచూపుతుంది. అదే జరిగితే కాకినాడ వేదికగా నిలవాలని అందుకు అనువైన గ్రౌండ్ ఇక్కడ ఉంది. ఎక్సో టర్ఫ్ గ్రౌండ్ జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్లకు అనువైన గ్రౌండ్ అందుకు అనుకూలంగా క్లబ్ లైట్స్ గ్యాలరీ ఏర్పాటుకు చీక్రీడా స్ఫూర్తితో కలెక్టర్ షణ్మోహన్ సలిగి 8.50 కోట్లు కేటాయించడంతో హాకీ క్రీడాకారులకు ఎంతో ఉప యోగకరంగా మారింది. గతంతో హాకీ క్రీడాకారులు ఇటువంటి గ్రౌండ్‌లో ప్రాక్టీస్ కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కాకినాడలో అందు బాటులో ఉంది. భవిష్యత్ క్రీడాకారులకు ఇది ఎంతో శుభపరిణామం.

హాకీ టోర్నీ కాకినాడలో జరగడం గర్వకారణం

● రవిచంద్రప్రసాద్ కడియాల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్



రవిచంద్రప్రసాద్ కడియాల

కార్పొరేషన్(కాకినాడ),ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సర్వీసెస్ హాకీ టోర్నీకి వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 44 జట్లు కాకినాడలో ఆడడం చాలా గర్వకారణం. ప్రభుత్వ సహకారంతో పాటు జిల్లా కలెక్టర్ హాకీ టోర్నమెంట్‌కు అనుకూలమైన గ్రౌండ్ తయారుచేయడానికి నిధులు కేటాయించడంతో ఇదంతా సాధ్యమైంది. జాతీయ, అంతర్జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఈ గ్రౌండ్ ఎంతో ఉప యోగకరంగా ఉంటుంది. కాకినాడలో పుట్టిపెరిగిన నేను హాకీ బ్యాట్ ప ట్టుకుని 1986 నుంచి 1989 వరకు అనేక జాతీయస్థాయి టోర్నమెంట్లు ఆడాను. తెలంగాణ హాకీ ఇన్‌కంట్ ట్యాక్స్ టీమ్‌గా న్యూఢిల్లీ ఇంటర్‌నేషనల్ టీమ్‌గా పని చేసున్నా. హాకీ మీద ఉన్న అభిమానంతో కాకినాడలోనే కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసి 25మంది అమ్మాయిలు, 25మంది అబ్బాయిలను క్లబ్ తరుపున దత్తత తీసుకుని వారికి కావాల్సిన కిట్లు ఏర్పాటుచేసి సౌకర్యాలు కల్పించి మెరుగైన హాకీ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకున్నాం.



బ్యాలెట్ బాక్సుల వినియోగంపై శిక్షణలో పీవో, ఏపీవోలు (ఫైల్‌ఫొటో)



దాడిలో గాయపడిన ఉమ్మిడి గోవిందు

యువకుడి కిడ్నాప్

● పిఠాపురం తీసుకువెళ్లి బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి ● సిగరెట్లతో కాల్చి చిత్రహింసలు
● మానవతా దృక్పథంతో సాయం చేసినందుకు ఫలితం ● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

గొల్లప్రోలు, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): యువకుడిని కిడ్నాప్‌చేసి బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేయడమేగాక సిగరెట్లుతో కాల్చి చిత్రహింసలకు గురిచేసిన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చిం ది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం దేవీనగరం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి గంగాధర్ టైల్స్ పనిచేసుకుని జీవనం సాగిస్తూ ఉంటాడు. రోజు మాదిరిగానే ఈనెల 11వ తేదీన రాత్రి 10.30గంటల సమయంలో పని పూర్తి చేసుకుని సురేష్ కల్యాణ మండపం మీదుగా ఇంటికి వెళుతుండగా ఇరు వర్గాలు అక్కడ కొట్లాడుకుంటున్నాయి. ఈ ఘర్షణలో పిఠాపురం పట్టణంలోని రథాల పేటకు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. అతన్ని మానవతా దృక్పథంతో నీరు అందిస్తుండగా రథాలపేటకు చెందిన చిన్న, పెద్ద, ఆకాష్, గొల్లప్రోలుకు చెందిన గణేష్, అంజి తదితరులు అతడిని బలవంతంగా పట్టుకుని మోటార్‌సైకిల్ లాక్కొని పిఠాపురం తీసుకువెళ్లారు. రథాల పేటలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లుతో విచక్షణా రహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. వంటిపై సిగరెట్లు కాల్చి చిత్రహింసలకు గురిచేశారు. రాత్రంతా హింసించి గాయపరిచిన వారు గంగాధర్‌ను తీసుకువచ్చి గొల్లప్రోలు టోల్‌గేట్ వద్ద తెల్లవారుజాము సమయంలో పడవేశారు. మోటార్‌సైకిల్‌ను వారి వద్దే ఉంచుకోవడంతోపాటు అతని జేబులో ఉన్న రూ.3,800 లాక్కొన్నారు. అతను ఆసుపత్రిలో చికిత్స పొంది గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

పోలీసింగ్‌పై విమర్శలు

యువకుడిని కిడ్నాప్‌చేసి పిఠాపురం పట్టణంలో చిత్రహింసలకు గురిచేసిన సంఘటన పిఠాపురం నియోజకవర్గంలో సంచలనంగా మారింది. పిఠాపురంలో పోలీసింగ్ తీరుపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ బదిలీ కావడం, పోలీసులు పిఠాపురం పట్టణంలో తనిఖీలు, రాత్రిపూట గస్తీలంటూ కొద్దిరోజులు హడావుడి చేశారు. తర్వాత మరలా పోలీసింగ్ అంతంత మాత్రంగానే మారింది. రాత్రిపూట పోలీసులు గస్తీ తిరుగుతూ ఉంటే యువకుడిని కిడ్నాప్‌కు తీసుకువెళుతున్నప్పుడు లేదా అతనిని నిర్మానుష్య ప్రదేశంలో చిత్రహింసలకు గురిచేసినప్పుడు గుర్తించి కాపాడే వీలుండేదని పలువురు వాఖ్యానిస్తున్నారు. యువకుడిపై దాడి చేసిన వారు అందరూ మద్యంమత్తులో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ తరహా సంఘటనలు వెలుగులోకి వచ్చిన తర్వాత పోలీసుల్లో అంతగా కదలిక కనిపించకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.

4.3 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

గండేపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం గండేపల్లి ఎస్‌ఐ యూవీ శివనాగబాబు, సిబ్బంది గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో బైక్‌పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులను ఆపి పరిశీలించగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. 4.3 కిలోల గంజాయి, ఒక మోటారు సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజవొమ్మంగికి చెందిన కెకె సాగర్, మాడుగులకు చెందిన కేపి కుమార్, సామర్లకోటకు చెందిన పీకే కృష్ణను అరెస్టు చేశారు. కిర్లంపూడికి చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టుచేసిన వారిని కోర్టులో ప్రవేశపెట్టగా 14రో జులు రిమాం డ్ విధించినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. మొత్తం సొత్తు విలువ రూ.61,500 ఉంటుందన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ఐ.పోలవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం రాత్రి ఈదుర్ఘటన జరిగింది. దూకిన వ్యక్తి పశువుల్లంకకు చెందిన చింతలపూడి శ్రీనివాసరావు(66)గా పోలీసులు గుర్తించారు. అన్నంపల్లి అక్విడెక్టు సమీపంలో ఆదివారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. అమలాపురానికి చెందిన అల్లుడు బీమాల రవికుమార్ వేధింపులు భరించలేక తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుని భార్య అమ్మాజీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్నేళ్లుగా తన కుమార్తెకు విడాకులు ఇవ్వకుండా అల్లుడు మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ముమ్మిడివరం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు రెడీ

» మిగిలింది 10 రోజులే
» 6 జిల్లాల్లో పట్టభద్రులు సిద్ధం
» 456 పోలింగ్ కేంద్రాలు
» 2 వేల మంది విధులు
» 22న తుది విడత శిక్షణ

ఏలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ గడువు పది రోజులు లోపే ఉండడంతో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ఇప్పటికీ ఒక విడత శిక్షణ పూర్తి.22న మరోసారి పీవో, ఏపీవోలు,ఇతర సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయనున్నారు. మోడల్ కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పోలింగ్ నిర్వహిస్తారు. దాదాపుగా 2 వేల పైబడి అధికార,సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 456 పోలింగ్ కేంద్రాల్లో ఒక పీవోతో పాటు ఏపీవో మరో ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ విధుల్లో ఉండనున్నారు. ఆరు జిల్లాల్లో కలిపి మొత్తం 456 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది మైక్రో అబ్జర్వర్లు, 456 మంది వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్‌తో నిఘా పెట్టనున్నారు. అదనంగా 20 శాతం రిజర్వ్‌లో అధికారులు, సిబ్బంది కూడా ఎన్నికల విధులకు సిద్ధం అయ్యారు.ఆరు జిల్లాల పరిధిలో ఎన్నికలు జరుగుతుండడంతో ప్రతి జిల్లాలో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు 10 మంది జోనల్ ఆఫీసర్లు చొప్పున మండల లేదా, డిప్యూటీ తహశీల్దార్ కేడర్‌లోని అధికారులు పనిచేస్తారు.

26న పోలింగ్ సామగ్రి తరలింపు..

జిల్లా కేంద్రాల్లో 26న ఉదయం పోలింగ్ మెటీరియల్‌తో ఎన్నికల సిబ్బంది రూట్ ఆఫీసర్ల పర్యవేక్షణలో బస్సుల్లో బ్యాలెట్ బాక్సుల, ఇతర సామగ్రితో తరలివెళ్లనున్నారు. ఆయా జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద 25వ తేదీ రాత్రికే ఏర్పాట్లను ఆయా జిల్లా కలెక్టర్లు పూర్తి చేస్తారు. 27న తర్వాత పోలింగ్ పూర్తయ్యాక ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు పోలింగ్ కేంద్రాల వరుస ప్రకారం భద్రపరచనున్నారు.ఈ ప్రక్రియ అంతా పోలీస్ యంత్రాంగం ద్వారానే జరగనుంది.

ప్రకటనలకు ఆమోదం తప్పనిసరి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటలనకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాల్సి ఉంటుందని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె వెట్రిసెల్వి తెలిపారు.ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముందు సంబంధిత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియామవళి ప్రకారం 25వ తేదీ సాయంత్రం 4 గంటకల్లా ప్రచారానికి తెరపడుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

● బైక్‌ను ఢీకొట్టిన జామాయిల్ లోడ్ ట్రాక్టర్
● ఎటపాక నవోదయా సమీపంలో ఘటన

ఎటపాక, ఫిబ్రవరి 16 ఆంధ్రజ్యోతి: బైక్‌ను ఎదురుగా వస్తున్న జామాయిల్ కర్రల లోడ్ ట్రాక్టర్ ఢీకొని భార్యాభర్తలు మృతి చెందిన ఘటన ఆదివారంరాత్రి అల్లూరిజిల్లా ఎటపాక మండలంలో జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో చోటు చేసుకుంది. ఈఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెంజిల్లా దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం పంచాయతీ లోని భీమవరం గ్రామానికి చెందిన సోయం రాంబాబు(52) సోయం ముత్యాలమ్మ(45) భార్యాభర్తలు. ఇరువురు భద్రాచలం వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి ఎటపాక మీదుగా తెలంగాణలోని భీమవరంనకు వెళుతున్నారు. ఈక్రమంలో లక్ష్మీపురం వైపు నుంచి జామాయిల్ లోడ్‌తో ఎటపాక వైపు వస్తున్న ట్రాక్టర్ నవోదయ విద్యాలయం సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో భార్యాభర్తలు ఇరువురు తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వెంటనే క్షతగ్రాతులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు పరీక్షించి ఇద్దరు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్యాభర్తలు రాంబాబు, ముత్యాలమ్మ(ఫైల్)

కత్తిపూడి ప్రమాదంలో వ్యక్తి మృతి

● మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన సత్యనారాయణ

శంఖవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి 16వ నెంబరు జాతీయరహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నక్కా సత్యనారాయణ (50) మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెందుర్తి గ్రామానికి చెందిన మృతుడు కత్తిపూడి వచ్చి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతుండగా మరో ద్విచక్రవాహనం వెనుకనుంచి ఢీకొట్టడంతో సత్యనారాయణ తలకు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులను ప్రత్తిపాడు ఏరియా ఆసుపత్రికి తరలించగా, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని యువకుడి మృతి

● మరొకరికి గాయాలు



మృతి చెందిన దోకాడ రవికుమార్

తునిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని ఒక యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన తుని పట్టణ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పట్టణంలోని డీ మార్ట్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో విజయనగరంజిల్లా విలుపర్తి గ్రామానికి చెందిన దోకాడ రవికుమార్(25) రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన నకిరెడ్డి కిల్లాడి ఇద్దరు యువకులు అన్నవరం ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. తుని పట్టణంలోని డీ మార్ట్ సమీపంలో ఆగి ఉన్న వ్యాన్‌ను బలంగా ఢీ కొట్టడంతో రవికుమార్(25)అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్నేహితుడు కొల్లాడి తీవ్ర గాయాలపాలయ్యాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తుని పట్టణ పోలీసులు గాయాలపాలైన వ్యక్తిని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు

● పోటెత్తిన వేలాది మంది భక్తులు
● ఒక్కరోజే రూ. 5లక్షల ఆదాయం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి):శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో స్వామివారి జన్మదినం, తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. మాఘమాసం మూడో ఆదివారం తిరునాళ్ల, స్వామి జన్మదినోత్సవ పర్వదినాలు ఒకేరోజు కలసి రావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లా నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటూ కర్నాటక, మహారాష్ట్ర నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజాము 4 గంటల నుంచే స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి మేల్కొలిపిన అనంతరం భక్తులకు దర్శనం అనుమతించారు. ముందుగా భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయం ఈశాన్యదిక్కులోఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఉన్న ఆదిశేష శ్రీభావనారాయణస్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవుపిడకల పొయ్యిపై ఆవుపాలతో పరమాణ్ణం వండి నైవేథ్యం సమర్పించారు. మాఘమాసంలో స్వామివారిని దర్శించుకుంటే దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లోఉన్న శైవక్షేత్రాలను దర్శించుకున్న ఫలితం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఎం.లక్ష్మీనారాయణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఫుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు, సౌకర్యాలు, వసతి కల్పించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అరుణ దంపతులు, కుమారుడు సందీప్‌ల ఆధ్వర్యంలో 25 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు వివిధ కానుకల రూపంలో హుండీలు, దర్శనం, సేవలు, ప్రసాదం, అన్నదానం ద్వారా రూ.5,00,300 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.



పాలపొంగలి తయారు చేస్తున్న భక్తులు

ముత్యాలమ్మ తీర్థం

అల్లవరం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియుల ఇలవేల్పు, ఓడలరేవు గ్రామదేవత ముత్యాలమ్మవారి తీర్థం ఆదివారం జరిగింది. శనివారం రాత్రి ముత్యాలమ్మ జాతర, ఆదివారం తీర్థం జరిగింది. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లంకే భీమరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

మసీదును ప్రారంభించిన సర్పంచ్

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి ముస్లిం వీధిలో నూతనంగా మసీదు నిర్మాణమైంది. స్థానిక ముస్లింలు స్వయంగా రూ.30లక్షలతో ఈమసీదును నిర్మించారు. ఈమసీదును ఆదివారం సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మసీదు సంఘం చైర్మన్ షేక్ జిలానీ, సలాది సతీష్, ఖాదర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాలతో ప్రైవేటు కాన్వెంట్ల కరస్పాండెంట్లకు ఇబ్బందులు

ముమ్మిడివరంలో జిల్లా ప్రైవేటు కాన్వెంట్ల కరస్పాండెంట్ల సమావేశం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రైవేటు కాన్వెంట్ల కరస్పాండెంట్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రైవేటు కాన్వెంట్ల కరస్పాండెంట్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ ఆరోపించారు. ముమ్మిడివరంలోని యాపిల్ స్కూలులో గోదశి పుండరీష్ అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా ప్రైవేటు కాన్వెంట్ల కరస్పాండెంట్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాచార హక్కు చట్టంలో లేని అంశాలను అధికారులు ప్రైవేటు పాఠశాలలపై రుద్దడం దారుణమన్నారు. ముఖ్యంగా విద్యా హక్కుచట్టం-2010 రూల్స్‌లోని రూల్ నంబరు 14లో ఉన్న లొసుగులపై ఇప్పటికే కోర్టు నుంచి స్టే తీసుకువచ్చామన్నారు. దీనిపై కరస్పాండెంట్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాలు చేసిందని, తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. ప్రైవేటు కాన్వెంట్ల సమస్యలను విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రైవేటు కాన్వెంట్ల సమస్యలపై భవిష్యత్తులో పోరాటం ఉంటుందన్నారు. తన శాసనమండలి అభ్యర్థిత్వాన్ని బలపరిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తులిప్స్ రమేష్, ముమ్మిడి ప్రతాప్, మంగళంపల్లి అంజిబాబు, సిరిపల్లి సిద్ధార్థ సత్యనారాయణ, భవిష్య ప్రసాద్, పొత్తూరి లక్ష్మీశ్రీనివాసన్, శ్రీనివాస్, నిమ్మన నాగు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

పట్టభద్రులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు



ఎమ్మెల్సీ మేనిఫెస్టో బ్యాలెట్ పేపర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

ముమ్మిడివరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేస్తుందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. ముమ్మిడివరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ తరపున నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన కొందరు వెబ్‌సైట్లను పెట్టుకుని ఓటర్లుగా నమోదైన పట్టభద్రులను మీరు ఎక్కడి నుంచి వస్తున్నారు, ఎంతమంది వస్తున్నారో చెబితే ట్రైన్, బస్ టిక్కెట్లు బుక్ చేస్తామని అడుగుతున్నట్టు హర్షకుమార్ ఆరోపించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ విడుదల చేసిన మేనిఫెస్టో, బ్యాలెట్ పేపర్లను ఆయన ఆవిష్కరించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణకుమార్, కాశి లక్ష్మణస్వామి, నెల్లి బాలకృష్ణ, బడుగు జేమ్స్‌పాల్, కాశి రామకృష్ణ, మోకా రామారావు, వడ్డి శ్యామ్‌ప్రసాద్, బి.ప్రసాద్, కాశి బాలకృష్ణ, మెండి కృష్ణబాబు, మట్టపర్తి సురేష్, కాశి జగపతిరావు, ఇసుకపట్ల శివకుమార్, తిరుకోటి సురేష్, పెయ్యాల సిద్దువాకపల్లి నరేంద్ర, దడాల బుజ్జిబాబు, నీలం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవగుప్తంలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

నిందితుడి అరెస్టు.. డీఎస్పీ, సీఐల సందర్శన



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న నిందితుడు గంగాధర్

అల్లవరం, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం దేవగుప్తం శివారు కాశిపేట వద్ద శనివారం రాత్రి అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగింది. కె.గంగవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన గొల్లపల్లి గంగాధర్ అనే యువకుడు అంబేడ్కర్ విగ్రహంపై మూత్రం పోయడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. గంగాధర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం గంగాధర్‌తో అంబేడ్కర్ విగ్రహాన్ని కడిగించి పాలతో శుద్ధి చేయించారు. సంఘటనా స్థలిని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, టౌన్ సీఐ పి.వీరబాబు, అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ సందర్శించారు. విగ్రహం వద్ద ముందు జాగ్రత్త చర్యగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. సాపే మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు నిందితుడు గంగాధర్‌ను పోలీసులు అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నిందితుడు గంగాధర్‌పై కేసు నమోదు చేశామని, అక్కడ పరిస్థితి అదుపులో ఉందని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

అంతర్జాతీయ క్రీడావేదికగా గొల్లవిల్లి: ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడాకారులకు వేదికగా ప్రశంసలందుకున్న గొల్లవిల్లి హైస్కూల్ క్రీడా మైదానాన్ని అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా యువత కార్యాచరణ రూపొందించాలని వాలీబాల్ టోర్నమెంటు గౌరవ అధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు విజ్ఞప్తి చేశారు. గొల్లవిల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల26 నుంచి మార్చి ఒకటవ తేదీ వరకు జరిగే అరిగెల శ్రీరంగయ్య ఆల్ ఇండియా మెన్ డే అండ్ నైట్ ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంటు ఆహ్వాన పత్రికలను ఆదివారం గొల్లవిల్లిలో శ్రీరంగయ్య స్వగృహం వద్ద ఆయన ఆవిష్కరించారు. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ నాలుగు రోజుల మ్యాచ్‌ల వివరాలను తెలిపారు. కస్టమ్స్(ముంబాయి), ఇన్‌కమ్‌ట్యాక్స్(గుజరాత్), ఎన్‌సీవోఈ(కేరళ), ఈస్ట్రన్ రైల్వేస్(పశ్చిమబెంగాల్), ఇండియన్ బ్యాంక్ (చెన్నై), ఐసీఎఫ్(తమిళనాడు) జట్లు ఈపోటీల్లో పాల్గొంటున్నట్టు వివరించారు. ఫ్లడ్ లైట్స్ వెలుతురులో డే అండ్ నైట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టోర్నమెంటు ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, ట్రెజరర్ గనిశెట్టి తాతాజీ, ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ, సాంకేతిక సలహాదారులు పుంద్రు రాజబాబు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్, ఉపాధ్యక్షుడు సలాది నాగరాజు, కార్యవర్గ సభ్యులు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, చిక్కం పెదబాబు, గనిశెట్టి భోగిరాజు, చీకట్ల ఏసు, సలాది సత్తిబాబు, చిక్కం కాసు, కూటమి నాయకులు అధికారి జయలక్ష్మి, మల్లుల పోలయ్య పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ

సాంస్కృతిక కళా సంబరాలు ప్రారంభం

అంతర్వేది, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం గోదావరి కల్చరల్ అసోసియేషన్ పంచమ వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతి కళా సంబరాలను వీవీమెరక కమ్యూనిటీ హాలులో శ్రీశ్రీకళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివారం ప్రారంభించారు. జానపదం, నాటిక, ఏకపాత్రలు, ట్రాక్ సింగింగ్, మ్యూజిక్, భరతనాట్యం, కవి సమ్మేళనం, వివిధ రకాల రంగస్థల ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం కళాకిరీటి పురస్కారాల ప్రదానం జరిగింది. కార్యక్రమంలో నాటక సామ్రాట్ సీహెచ్ రామారావు, నటరత్న కడలి కృష్ణారావు, ఇంద్రజాల బ్రహ్మ అల్లూరి జానకీరామరాజు, కళారత్న పిచ్చిక గంగాధరరావు, కళాబంధు వాకా రాంబాబు తదితరులు పలు కళాత్మకమైన అంశాలతో కూడిన వివిధ రకాల కళలను ప్రదర్శించారు. బోళ్ల సతీష్, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం రైతు బజార్ నిర్వహణలో భాగంగా కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) ఆదివారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి వినతిపత్రం అందజేశారు. రైతు బజార్‌లో రాత్రి పూట బోర్డు సుస్పష్టంగా కనిపించేలా విద్యుత్‌తో బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రవేశ ద్వారం నుంచి స్టాల్స్ వరకు విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని, రైతులు, అమ్మకందారులు, వినియోగదారులకు వాష్‌రూములు నిర్మించాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఐవీ కోరారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

పలు చోట్ల ఎన్నికల ప్రచారం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం నడిపూడి, పాలగుమ్మి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి-బాబ్జి, బూత్ కన్వీనర్ కడియం సత్యనారాయణ, జనసేన నాయకుడు నల్లా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ దంగేటి వెంకటేశ్వరరావు, బొక్కా శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం: పాలగుమ్మిలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



రాజోలు:శివకోడులో చాగంటి స్వామికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాణేలంకలో ప్రచారం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని టీడీపీ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం రాణేలంకలో పట్టభద్రులను కలిసి ఓటును రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, బొక్కా సత్యనారాయణ, చింతలపూడి సత్యనారాయణ, కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు(శేర్), ఇసుకపట్ల ఈశ్వరకుమార్, పితానిశివ, పితాని శ్రీనివాసరావు, కడలి నాగేశ్వరరావు, వనచర్ల బాలకృష్ణ, కడలి వాసు, చింతలపూడి ప్రసాద్, కొత్తపల్లి చంటి, బొక్కా నవీన్, కడలి వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాట్ల ప్రచారం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఐ.పోలవరం, కేశనకుర్రు, మురమళ్ల హైస్కూళ్లలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి పేరాబత్తుల విజయానికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, బీర సత్యకుమారి, చిలువూరి సుబ్బరాజు, వనచర్ల వెంకటేశ్వరరావు, మద్దిరెడ్డి కుమార్, గాదిరాజు విశ్వనాధరాజు, గాదిరాజు రామకృష్ణంరాజు, బొంతు శ్రీరాములుతో పాటు యూనిట్ ఇన్‌చార్జి, బూత్ ఇన్‌చార్జులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొంటున్నారు.

గ్రామాల్లో ప్రచారం

కాట్రేనికోన, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొప్పిగుంట, రావులచెరువు, కోమటిచెరువు ప్రాంతాల్లో ఆదివారం కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వనచర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, వెంట్రు సుధీర్, విత్తనాల వెంకటరమణ, వాసంశెట్టి రాజేశ్వరరావు, సత్తాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లు అభ్యర్థన

అంబాజీపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు దువ్వారపు రామారావు ఆదివారం కె.పెదపూడిలో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గ అబ్జర్వర్ షేక్ సుభాన్, కోకన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు గుడాల ఫణి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, మందా రాజేష్, గుంటూరి మురళీకృష్ణంరాజు, నేదునూరి పెద్దిరాజు, మోకా శ్రీను, చిక్కం పల్లంరాజు, పెచ్చెట్టి హరిబాబు, కాసా నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విజయం చేకూర్చండి

మలికిపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ అఖండ విజయం సాధిస్తారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. దిండి, రామరాజులంక, మేడిచర్లపాలెం తదితర గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. చిటికెల రామ్మోహనరావు, గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, చాగంటి స్వామి, మంగెన నాని, గుబ్బల శ్రీనివాస్, బందెల పద్మ, ముదునూరి శ్రీనివాసరాజు, మేడిచర్ల చాణక్య, గోనిపాటి రాజు, దేశినీడి తాతాజీ, ఉంగరాల బాలాజీ, పిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

శివకోడులో ప్రచారం

రాజోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అభ్యర్థించారు. ఆదివారం శివకోడు, చింతలపల్లి, కూనవరం ములికిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, రాజోలు నీటిసంఘం అధ్యక్షుడు పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణికుమార్, బోళ్ల రాజేష్, కరప భద్రం, కడలి ఏడుకొండలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

అంబాజీపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1969కు చెందిన మొదటి పదో తరగతి బ్యాచ్ అంబాజీపేట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కమ్యూనిటీ హాలులో ఆదివారం కలుసుకున్నారు. అప్పటి విద్యార్థులు ఆ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థులు డాక్టర్ వీరా ధన్వంతరి, డాక్టర్ బీఎన్ మూర్తి, హైదరాబాద్ చార్టెడ్ అకౌంటెంట్ కందాళ మోహనరావు, నందంపూడి జమీందార్ వడ్లమాని కామేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అరిగెల బలరామమూర్తిని సమావేశంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాగితాపల్లి చంద్రరావు, యాళ్ల ప్రభాకరరావు, దయామణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.02లక్షల విలువైన వస్తువుల అందజేత



పి.గన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పి.గన్నవరం సీహెచ్‌సీకి రూ.1.02 లక్షలు విలువైన సామగ్రిని ట్రస్ట్ చైర్మన్ బీమాల వెంకటేశ్వరరావు అందించారు. దాతలు సహకారంతో రెండు స్టీలు కుర్చీలు, రెండు టీవీలు, రెండు ఐరెన్ రేపర్లు, వంద దుప్పట్లు, పది ఫ్యాన్లు అందించినట్టు ఆయన తెలిపారు. ఈసామాగ్రిని ఆసుపత్రి హెడ్‌నర్సు జి.లక్ష్మీఅనంతకుమారికి అందించారు. ఈసందర్భంగా దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.30లక్షలతో ఆసుపత్రిని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గూటం శ్రీనివాసరావు, ఆసు పత్రి సిబ్బంది పి.వి.సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ అధికారులతో వాహనకారుల సమావేశం

అంతర్వేది, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 6వ తేదీ రాత్రి స్వామివారు శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాద ఘటన గురించి ఆలయ అధికారులతో వాహనసేవకులు, అగ్నికుల క్షత్రియులు ఆదివారం సమావేశమయ్యారు. వాహన సేవకులను దేవస్థానానికి సంబంధించిన చెత్త తీసుకువెళ్లే ఆటో ఢీకొనడంతో ఇద్దరికి స్వల్ప గాయాలు, ఒకరికి బలమైన గాయడం కావడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితులను ఎవరూ పట్టించుకోపోవడంపై వాహన సేవకులంతా ఆలయ అధికారులను ప్రశ్నించారు. సహాయకమిషనర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారులు, వాహన సేవకులు పెద్దలతో చర్చించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సర్పంచ్ ఒడుగు శ్రీను, మాజీ సర్పంచ్‌వనమాలి మూలాస్వామి పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా ఊటుకూరి



రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సుబ్రహ్మణ్యస్వామిని అభినందిస్తున్న నాయకులు

అమలాపురంరూరల్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బండారులంక గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మచ్చా నిరంజన్, బళ్ల వెంకటరమణ, చింతా శంకరమూర్తి, యినుమర్తి లింగమూర్తి, బళ్ల కిశోర్, కూర్మా రాహుల్, మాడా మాధవి, చింతా శ్యామ్‌కుమార్, కాలెపు శివ, మాడా రాము అభినందించారు.

యువ సమ్మేళనానికి యానాం యువకులు

యానాం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కేరళలోని ఎర్నాకుళంలో సోమవారం నుంచి ఐదు రోజులు జరిగే అంతర్రాష్ట్ర యువ సమ్మేళనానికి యానాం నెహ్రూ యువకేంద్ర సంఘటన్ నుంచి అయిదుగు యువకులను ఎంపికచేసినట్లు యువజనాధికారి టి.గోపి తెలిపారు. వీరిలో లంక వినయ్, మన్నె కిరణ్‌కుమార్, దండకడియాల ప్రశాంత్, పెద్దిమేని దుర్గప్రసాద్, దూడల సతీష్‌లు ఉన్నారు. వారు యానాం నుంచి కేరళ బయలుదేరి వెళ్లారు. వారికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అభినందనలు తెలిపారు.

మీ భద్రతే కుటుంబానికి శ్రీరామరక్ష: సీఐ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మీరు మోటారుసైకిళ్లపై భద్రంగా ఇంటికి చేరుకుంటే మీ కుటుంబానికి ఎల్లవేళలా శ్రీరామరక్షగా ఉండగలుగుతారని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు చేతబూని మోటారుసైకిలిస్టులు చేపట్టిన ర్యాలీని అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో పట్టణ సీఐ వీరబాబు ప్రారంభించారు. హెల్మెట్ ధరిద్దాం. వేగంగా వద్దు.. నెమ్మదిగా పోదాం వంటి నినాదాలు చేస్తూ నల్లవంతెన, ఎర్రవంతెన మీదుగా హైస్కూలు సెంటర్ నుంచి తిరిగి ర్యాలీ గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుంది. పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ఏసుబాబు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

అమలాపురంరూరల్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ఇమ్మిడివరప్పాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం హోమక్రతువులు నిర్వహించారు. సోమవారం ఉదయం 10.45గంటలకు శ్రీవిఘ్నేశ్వరస్వామి, భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

కాట్రేనికోన, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో 4,435మంది రైతులకు కేవలం 1,690మంది రైతులు మాత్రమే రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకున్నట్టు వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. విశిష్ట సంఖ్య నమోదు కాకుంటే పీఎంకిసాన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లోకి రావన్నారు. ఈ నెల 25లోగా సమీపంలోని రైతు సేవాకేంద్రంలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల విస్తరణ, మరమ్మతు పనులు చేపడుతున్నట్టు ట్రాన్స్ కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 8నుంచి రాత్రి 7 గంటల వరకు కాట్రేనికోన, దొంతికుర్రు, గెద్దనపల్లి, పల్లంకుర్రు, కందికుప్ప, నడవపల్లి, కుండలేశ్వరం, బలుసుతిప్ప గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

డ్రెయిన్‌లో షిల్టు తొలగింపు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మురమళ్ల డ్రెయిన్‌లో పేరుకుపోయిన షిల్ట్‌ను తొలగించే కార్యక్రమం పంచాయతీ చేపట్టింది. డ్రెయిన్ మూసుకుపోవడంతో మురుగు దిగేందుకు ఇబ్బందిగా మారింది. జేసీబీ సాయంతో డ్రెయిన్‌పై సిమెంట్ బల్లలను తొలగించి కూలీల ద్వారా షిల్టు తొలగిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి పి.రవిరాజు పనులను పర్యవేక్షిస్తున్నారు.

హెచ్‌ఎంలకు సన్మానం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మురమళ్లకు చెందిన 14మంది, భైరవపాలెం స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ ఉపకారవేతనాలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన లంకే హేమశ్రీనివాస్, ఎం.వీరవెంకటసత్యనారాయణమూర్తిని ఆదివారం మురమళ్ల హైస్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ ప్రతినిధులు ఎస్ఎన్ మునేశ్వరరావు, టి.దుర్గాప్రసాద్, ఆకెళ్ళ సూర్యమోహన్, క్లస్టర్ హెచ్‌ఎం మట్టపర్తి శ్రీనివాసరావు, వీవీ సుబ్రహ్మణ్యం, టి.సురేష్, రోహిణి పాల్గొన్నారు.

సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మామిడికుదురు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మొగలికుదురులోని శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. వెరికోసిస్ లక్షణాలున్న 2003 మందికి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు స్వామి, జీవీ ప్రవీణ్‌కుమార్‌లు వైద్య సేవలందించారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి వారికి ఉచితంగా హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయిస్తామని తెలిపారు. కార్పొరేట్ వైద్యం పేదలకు ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ఈశిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు అంబేడ్కర్ కోనసీమ జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షుడు అడబాల కొండబాబు తెలియచేశారు. శిబిరంలో సేవా సంస్థల ప్రతినిధులు ఎ.కృష్ణ, డాక్టర్ కాశిన ప్రభాకర్, ఎంపీ వర్ధనరావు, వాసవి బుజ్జి పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి జాతర

అయినవిల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వీరవల్లిపాలెం గ్రామదేవత శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. సర్పంచ్ సలాది బుజ్జిరాజా, జనసేన మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, అడపా నాగభూషణం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి బాడవలోని ఉత్తర బాడవలో వీరభద్రస్వామి సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాశీభట్ల రామేశ్వరసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సంబరాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం వీరభద్రస్వామిని మేలుకొలిపి ప్రభ ఉత్సవంతో మేళతాళాలతో బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా పవిత్ర వైనతేయ నదీ తీరానికి తీసుకువెళ్లి అక్క నదీ స్నానమాచరించారు. నది ఒడ్డున శమీపూజ నిర్వహించారు. రాత్రి వీరభద్రస్వామి భక్తులు నిప్పుల గుండాన్ని తొక్కి భక్తిని చాటుకున్నారు. ఆయా కార్యక్రమాలన్నీ శ్రీవీరభద్రస్వామి బాలభక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

నేడు ఆలయ వార్షికోత్సవ పూజలు

మామిడికుదురు, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో వాసంశెట్టి సత్యనారాయణమూర్తి నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయంలో వార్షికోత్సవ పూజలు సోమవారం నిర్వహించడానికి అన్నిఏర్పాట్లు చేశారు. స్థానిక హైస్కూలురోడ్డులో ఉన్న ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, గణపతి హోమం, అన్నసమారాధన నిర్వహిస్తారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించాలని ఆలయ నిర్మాతలు సత్యనారాయణమూర్తి, వెంకటరమాకాంత్‌బాబు, కవిత దంపతులు కోరారు.

నగరం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామాన్ని ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సహజ వనరుల పరిరక్షన కమిటీ రాష్ట్ర నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరం ఓఎన్జీసీ సైట్ వద్ద సీపీఐ నాయకులు ఆదివారం పర్యటించారు. 2014లో నగరంలో జరిగిన గ్యాస్ లీకేజీ వల్ల 22మంది మరణించారని, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుని వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. ఈనెల23న కాకినాడ గాంధీభవన్‌లో ఏర్పాటుచేసిన సదస్సుకు పెద్దఎత్తున బాధితులు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమిటీ నాయకులు డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, డేగా ప్రభాకర్, దేవ రాజేంద్రప్రసాద్, జాలెం సుబ్బారావు, నల్లి చిట్టిబాబు, పుల్లెల ఆనంద్, మొల్లేటి శ్రీనివాస్, సకిలే శ్రీను, గెడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారంలో 18రోజులుగా జరుగుతున్న నక్షత్ర నవగ్రహపూర్వక మహాసౌరయాగంలో ఆదివారం ఆదిత్యహృదయ పఠనం, సంకటహరచతుర్థి పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్ర జాతకులు కుంకుడు చెట్టుకు పూజలు చేశారు. మున్నంగి రామకృష్ణశర్మ పర్యవేక్షణలో యర్రమిల్లి గురుచరణ్‌శర్మ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వాగ్దేవను సన్మానించిన జిల్లా రవాణాధికారి

రాజోలు, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అక్కౌంట్స్ చివరి సంవత్సరంలో ఆలిండియా2వ ర్యాంకు సాధించిన రాజోలు మండలం తాటిపాకకు చెందిన లక్కింశెట్టి రాఘవేంద్ర వాగ్దేవను జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాస్ ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి సత్కరించి అభినందనలు తెలిపారు. వాగ్దేవను ప్రోత్సహిస్తున్న తండ్రి సోమేశ్వరరావు, తల్లి లక్ష్మిని ఆయన అభినందించారు.

చికిత్స పొందుతూ సర్పంచ్ రామకృష్ణ మృతి

-లంకలగన్నవరం గ్రామంలో విషాదఛాయలు



పి.గన్నవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ లంకలగన్నవరం గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణ (46) ఆదివారం మధ్యాహ్నం మృతిచెందారు. ఈనెల5న తాడేపల్లిగూడెంలో ఉన్న బంధువులు ఇంటికి వెళ్లి తిరిగివస్తుండగా బెల్లంపూడి వద్ద అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంతో పంట బోదెలోకి దూసుకువెళ్లిన ఘటనలో రామకృష్ణకు తీవ్ర గాయాలైన విషయం విదితమే. దీంతో పి.గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రామకృష్ణ మృతిచెందారు. సర్పంచ్ మృతితో లంకలగన్నవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సామాన్య కుటుంబానికి చెందిన సర్పంచ్‌కు భార్య సీతారత్నం, కుమారుడు పవన్‌వెంకటసాయి, కుమార్తె బాలరాజేశ్వరి ఉన్నారు. రామకృష్ణ మృతిపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, ప్రతిపక్ష నాయకులు సంతాపం తెలిపారు.

డాబాపై నుంచి పడి వ్యక్తి మృతి

పి.గన్నవరం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు డాబాపై నుంచి వ్యక్తి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. వైపీపాలేనికి చెందిన యర్రంశెట్టి వీరస్వామినాయుడు(55) కూరగాయల వ్యవసాయం చేసుకుంటూ కొంత కాలంగా పి.గన్నవరం శివాలయం సమీపంలో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం టీవీ చానళ్లకు సంబంధించిన డిష్ పనిచేయకపోవడంతో డాబాపై మరమ్మతులు చేయిస్తున్నాడు. ఆ సమయంలో చెత్తను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు డాబాపై నుంచి క్రింద పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

మలికిపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం వంటిదని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పన్నెండు మంది లబ్ధిదారులకు రూ.13.50లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, భూపతిరాజు సాయిబాబురాజు, ముప్పర్తి నాని, మాలే శ్రీనివాసనగేష్, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, సూరిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పదవులకు దేవాంగ సంక్షేమ సంఘ సభ్యుల ఎంపిక

మామిడికుదురు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘంలో పలు విభాగాలకు మొగలికుదురు దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులు నియమితులయ్యారు. రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ కార్యదర్శిగా కొండా జగదీష్, రాష్ట్ర చేనేత విభాగం ఉపాధ్యక్షుడిగా గుంటు వీర వెంకటసత్యనారాయణ(జీవీ), రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షుడిగా కారుపర్తి షణ్ముఖసాయికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో ఆదివారం రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ దేవాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర పదవులకు ఎంపికైన వారిని పలువురు అభినందించారు.

చింతలూరు నూకాంబిక ఉత్సవాలకు శ్రీకారం



చింతలూరు నూకాంబిక ఆలయంలో ఉత్సవాలకు శ్రీకారం పూజలు చేస్తున్న దృశ్యం

ఆలమూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. వీటి పనులు ప్రారంభించేందుకు ఆదివారం ఉదయం ఆలయంలో పలు పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి, అర్చకుడు ప్రత్యేక పూజలు చేశారు. మార్చి 27న అమ్మవారి ప్రధాన జాతరతో పాటు, ఉగాది ఉత్సవాలు నిర్వహించడంతో దాదాపు రెండు నెలలపాటు జరిగే ఉత్సవాలకు లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఆది వారం జరిగిన పూజలతో ఉత్సవాల పనులు ప్రారంభిస్తున్నట్టు ఈవో వీర్రాజుచౌదరి తెలిపార. కార్యక్రమంలో నాయకులు గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, వైట్ల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు మోదుకూరు గ్రామానికి చెందిన యడ్లపల్లి సత్యనారాయణ దంపతులు రూ.1,01,111 విరాళం అందించారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకుని తమ విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి వీర్రాజుచౌదరి, గ్రామస్తులకు అందించారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో హాజరైన భక్తులు

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.4.45 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఆదివారం వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.4,45,856 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

వెంకన్న ఆలయంలో ఆర్జేసీ పూజలు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనరు, సింహాచలం అప్పన్న ఆలయ ఈవో యాండ్ర త్రినాథరావు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.

అర్హులైన కార్మికులు ఈశ్రమదాన్ కార్డులు పొందాలి



మండపేటలో కార్మికులకు ఈ శ్రమదాన్ కార్డుల ప్రయోజనాలు తెలుపుతున్న లేబర్ అధికారి

మండపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో పనిచేసే అర్హులైన కార్మికులంతా కేంద్ర ప్రభుత్వం అందించే ఈశ్రమకార్డులను పొందాలని మండపేట కార్మికశాఖ సహాయ అధికారి కాశి శివనాగమలేశ్వరరావు అన్నారు. మండపేటలో వున్న వ్యాపార సంస్థలు సినిమా హాల్స్, హోటళ్లలో పనిచేసే కార్మికులకు ఈశ్రమకార్డు వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన తెలిపారు. కార్మికుడు బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, ఫోన్ నెంబర్‌ను నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఈ-శ్రమపోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేయించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలని ఆయన సూచించారు. ఈ కార్డు ద్వారా రూ.2లక్షల వరకు బీమా తో పాటు ప్రమాదంలో వైకల్యం కలిగితే శాతాన్నిబట్టి రూ.2లక్షల వరకు బీమా పొందవచ్చని తెలిపారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

రావులపాలెం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రావులపాలెం డాన్‌బాస్కో పాఠశాల రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డాన్‌బాస్కో ప్రిన్సిపాల్ ఐ.పల్‌తజార్, ఫాదర్ నరేష్ ప్రారంభించారు. పదమూడు జిల్లాల నుంచి బాలికలు, బాలుర విభాగంలో పాల్గొన్నారు. వీరికి నెట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి భోజన వసతులు సమకూర్చారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోషియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పళ్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



డాన్‌బాస్కో పాఠశాల క్రీడా ప్రాంగణంలో నెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న సర్పంచ్ సతీష్‌రావు తదితరులు

క్రికెట్ టోర్నమెంటు విజేత తోటపేట

ద్రాక్షారామ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలో జైభీమ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిపిన క్రికెట్ టోర్నమెంటును తోటపేట జట్టు కైవసం చేసుకుంది. పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంటులో ఫైనల్‌కు తోటపేట, అముజూరు జట్లు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అముజూరు జట్టుపై తోటపేట జట్టు విజయం సాధించి టోర్నమెంటు విజేతగా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా తోటపేట జట్టు కెప్టెన్ నీలం ప్రసాద్ నిలిచారు. విజేత తోటపేట జట్టుకు ట్రోఫీ, రూ 10 వేల నగదు, రన్నరప్ అముజూరు జట్టుకు రూ.5 వేల నగదు, ట్రోఫీ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి పార్వతి కుమార్తె బేబీ అందించారు. టోర్నమెంటు నిర్వహణకు ఆర్థికంగా సహకరించిన సర్పంచ్ సతీష్‌రావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి పార్వతి, మాజీ ఎంపీటీసీ ఉంగరాల వెంకన్నలకు జై భీమ్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

కె.గంగవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరగ్గా, దీన్ని రామచంద్రపురం గాంధీ ఆసుపత్రి నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలకు సంబంధించి పలు రకాల పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ చంద్రు విఠల్ కుమార్, చంద్రశేఖర్, పవన్ కుమార్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నేమాని అబ్బు, నేమాని సత్యనారాయణ, అల్లూరి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



గంగవరం వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

రైతు బజార్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం రైతు బజార్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) ఆదివారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి వినతిపత్రం అందజేశారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వృథాగా పంట పొలాల్లోకి తాగునీరు

• పాడైపోయిన ఎయిర్‌వెల్స్ • పట్టించుకోని అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అఖండ గోదావరి నుంచి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మెగా వాటర్ ప్రాజెక్టును నిర్మించి శుద్ధిచేసిన జలాలను ప్రజలకు అందిస్తున్నారు. ఇటీవల గ్రామాలకు వెళుతున్న పైపులైన్లు పగిలిపోయి తాగునీరు కలుషితం అవడమే కాకుండా వృథాగా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల గొంతు నింపాల్సిన తాగునీరు పంట పొలాల పాలవుతోందని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆత్రేయపురం మండలంలోని ఏడు గ్రామాల ప్రజలకు గోదావరి నీటిని శుద్ధిచేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో పాలకులు బొబ్బర్లంక, ఉచ్చిలి వద్ద రూ.13 కోట్లతో వాటర్ ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా గ్రామాల్లో అనుసంధానంగా మంచినీటి ప్రాజెక్టుల ద్వారా శుద్ధి చేసిన జలాలు ప్రజల దాహార్తి ని నింపుతున్నాయి. నాసిరకం పైపులైన్లు వేయడంతో అవికాస్తా పగిలిపోయి జలాలు కలుషితమవుతుండగా మరోపక్క ఎయిర్‌వెల్ తుప్పు పట్టి పాడైపోయాయి. అవికాస్తా రంధ్రాలుగా ఏర్పడటంతో పేరవరంలోని రెండుచోట్ల జలాలు వృథా పాలవుతోంది. కొద్దిరోజుల నుంచి తాగునీరు వృథాగా పోతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందన్న ఆరోపణలున్నాయి. త్వరితగతిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



పేరవరం వద్ద ఎయిర్‌వెల్స్ పాడైపోవడంతో పంట పొలాల్లోకి వెళుతున్న తాగునీటి జలాలు

ఆర్యవైశ్య సోషల్ మీడియా చైర్మన్‌గా కుమార్



పి.కుమార్

ఆత్రేయపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్యవైశ్య సంఘం సోషల్ మీడియా కమిటీ చైర్మన్‌గా వసలపూడి కుమార్ నియమితులయ్యారు. ర్యాలీకి చెందిన కుమార్ ఆర్యవైశ్య సంఘంలో పలు పదవులు చేపట్టారు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీకాకోళపు శివరామసుబ్రహ్మణ్యం ఈయన నియామకానికి కృషి చేశారు. ఈ నెల 19న అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంలో ఈయన ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి, మాజీ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జీబీఎస్ వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

రాయవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జీబీఎస్ వైరస్(గిలియన్ బార్ సిండ్రోమ్) వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మండలంలోని 12 గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులతో ఆదివారం మండల ప్రజా పరిషత్ విస్తర్ణ అధికారి శ్రీనివాసరావు జూమ్ మీటింగ్ జరిపారు. ఈసందర్భంగా ఈవోపీర్డీ మాట్లాడుతూ 12 గ్రామ పంచాయతీల పరిధిలో జీబీఎస్ వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలని, పంచాయతీల పరిధిలో నీటి వనరులను సందర్శించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సోమవారం అన్ని గ్రామాల్లోని పీడబ్ల్యూఎస్ వాటర్ ట్యాంకులను శుభ్రపర్చాలని తెలిపారు.



కవి సుబ్బారావుకు కళాకిరిటీ పురస్కారం అందిస్తున్న దృశ్యం

సుబ్బారావుకు కళాకిరిటీ పురస్కారం

కొత్తపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గోదావరి కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కళా సంబరాలలో కొత్తపేటకు చెందిన కవి డాక్టర్ వీవీవీఎస్ సుబ్బారావుకు కళాకిరిటీ పురస్కారాన్ని అందుకున్నారు. సమకాలీన రైతు సమస్యలపై రైతేరాజు ఏకపాత్రాభినయానికి పురస్కారం లభించింది. మల్కిపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో కొల్లి రమాదేవి, సీహెచ్ రామారావు, కడలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుదారులు లేక చికెన్ దుకాణాలు వెలవెల

ద్రాక్షారామ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వ్యాప్తితో ఈ ఆదివారం రామచంద్రపురం పట్టణంతో, మండలంలోని కోడి మాంసం దుకాణాలు వెలవెలపోయాయి. రామచంద్రపురంలోని మెయిన్ మార్కెట్‌తో పాటు మెయిన్ రోడ్డు, పలు కూడళ్లలోని కోడి మాంసం దుకాణాల వద్ద కొనుగోలుదారులు లేక బోసిపోయాయి. ద్రాక్షారామ మార్కెట్‌తో పాటు పలు కూడళ్లలో కోడిమాంసం దుకాణాల్లో కొనుగోలుదారులు లేక వ్యాపారులు ఒకటి రెండు కోళ్ల మాత్రమే పెట్టుకుని కూర్చున్నారు. చికెన్ వ్యాపారం చేస్తున్న 5వ వార్డు కౌన్సిలరు అమలదాసు లోవరాజు ఆదివారం నాలుగు కోళ్లు అమ్మకానికి పెట్టగా కేవలం రూ.70 అమ్మినట్లు తెలిపారు.

దుకాణదారులతో నేడు కమిషనర్ సమావేశం: కోడి మాంసం దుకాణదారులతో మున్సిపల్ కమీషనర్ అయ్యప్పనాయుడు నేడు సమావేశం నిర్వహిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి మాంసం విక్రయదారులు హాజరుకావాలని తెలిపారు.

విందుల్లో చికెన్ బంద్: బర్డ్‌ఫ్లూ ప్రభావంతో నిశ్చితార్థం, పుష్పాలంకరణ వేడుకలు, దశదిన కర్మలు వంటి కార్యక్రమాల విందుల్లో కోడి మాంసం పెట్టడం లేదు. ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో మేక మాంసం, చేపలతో విందులు సాగాయి. పట్టణంలోని రెస్టారెంట్లలో కూడా భోజనప్రియుల సందడి కనిపించలేదు. చికెన్ బిర్యానీతో పాటు చికెన్‌తో చేసే పలు వంటకాలు, అమ్మకాలు లేవని ఓ రెస్టారెంటు యజమాని తెలిపారు.

శరవేగంగా రోడ్డు మరమ్మతులు



రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణ

కె.గంగవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అముజూరు నుంచి సుందరపల్లి వరకు ఉన్న రహదారి మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ రహదారిలో గుంతలు ఏర్పడి ప్రయాణాలకు ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించింది. అముజూరు మెయిన్ రోడ్డు నుంచి నరజాడ, తమ్మయ్యపాలెం, సుందరపల్లి వరకు రోడ్డు గుంతలు పూడ్చే పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. కోటిపల్లిలో ఈనెల 26న జరగనున్న శివరాత్రి సందర్భంగా యాత్రికులు ఈ రహదారిలో ప్రయాణించే అవకాశం ఉండటంతో వాటి పనులు శివరాత్రి నాటికి పూర్తి చేసేలా చేస్తు న్నామని ఆర్‌అండ్‌బి డీఈ సూర్యనారాయణ చెప్పారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకులు పీవీజీ కుమార్

'ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలి'

కొత్తపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గ పరిశీలకుడు పీవీ గణేష్‌కుమార్ కోరారు. ఆదివారం కొత్తపేట శివారు చిన్నగూళ్లపాలెంలో పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో అనకాపల్లి టీడీపీ మహిళా అధికార ప్రతినిధి పి.సత్యవతి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి జయలక్ష్మి, ముత్యాల బాబ్జి, బీర ఇసాక్, వాసంశెట్టి సత్యనారాయణ, అద్దంకి చంటిబాబు, మామిశెట్టి వెంకటేష్, చోడపనీడి భాస్కరరావు, కముజు తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు ఆదివారం రామచంద్రపురం మండలంలో పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వెల్ల, కాపవరం, కందులపాలెం, తాడిపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన సమన్వయ కమిటీ సభ్యురాలు వైట్ల గజలక్ష్మి, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, అన్యం బేబీలు, మాజీ కౌన్సిలరు అల్లం శ్రీనివాస్, కవల నానాజీ, కంచుమర్తి బాబూరావు తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామచంద్రపురం కందులపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ



రాయవరం చెల్లూరులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురు వ్యక్తుల కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. గ్రామానికి చెందిన పుచ్చకాయల గోగులక్ష్మి, మల్లిపూడి లక్ష్మి, దొండకాయల నాగేశ్వరరావు మృతి చెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న వాసంశెట్టి శ్రీనును ఆయన పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ వైఎస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, పసల ప్రసాద్, టి.చంటిబాబు, జనసేన నేత ఆనంద్ ఉన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. పట్టణానికి చెందిన సుంకర మహాలక్ష్మి, గుణ్ణం రామారావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు షేక్ ఇబ్రహీం, బండి గోవిందు, వెంటపల్లి రోజారాణి, పసల ప్రసాద్, చంటిబాబు తదితరులు వున్నారు.

చెత్త ఉన్నా..సంపద సృష్టిలేదు

• మురుగుకాల్వల పక్కనే పడేస్తున్న వైనం • ఆదాయ మార్గమున్నా పట్టించుకోని పంచాయతీ

మండపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్త సేకరించి దాన్ని కంపోస్టు యార్డుకు తరలించి అక్కడ వేరు చేసిన చెత్త నుంచి సేంద్రీయ ఎరువును విక్రయించటం ద్వారా ఆదాయం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనికి భిన్నంగా చెత్త సంపద కేంద్రాలపై కానీ, చెత్త వేసేందుకు అవసరమైన స్థలసేకరణ కానీ పంచాయతీలు దృష్టి సారించటం లేదు. ఎందుకంటే చెత్త వల్ల ఇటు నాయకులకు, అటు పంచాయతీకి పెద్దగా ఆదాయం రాదు. దానివల్ల ఏ ఒక్కరూ చెత్త సమస్య పట్టించుకోరు. వచ్చిన చెత్తను ఊరికి దూరంగా పారేస్తే చాలు అన్న ఆలోచనే తప్ప దాన్నుంచి సంపద సృష్టిద్దామన్న ఆలోచన రావటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పనపాడు పంచాయతీలో వచ్చే రోజువారీ చెత్తను చెంతనే వున్న తుల్యభాగ డ్రైన్‌లో పారే స్తున్నారు. దీంతో తుల్యభాగ డ్రైన్ పూడుకు పోయి మురుగుకాల్వ రూపం కోల్పోతోంది. పైగా చెత్తను వేయటంతో పాటు నిప్పు పెట్టడం వల్ల కాలుష్యమయమవుతోంది. మండలంలోని వెలగతోడు, తాపేశ్వరం, ఇప్పనపాడు, ద్వారపూడి, జెడ్.మేడపాడు, మారేడు బాక, వై.సీతానగరం, అర్తమూరు తదితర పంచాయతీల వచ్చే చెత్తకు కంపోస్టుయార్డు లేక మురుగు కాల్వ గట్లనే చెత్త వేసే కేంద్రాలుగా వాడుకుంటున్నారు. పంచాయతీల నిర్వాకం వల్ల మురుగు కాల్వలు, పంట కాల్వలు వాటి స్వరూపాన్ని కోల్పోతున్నాయి. ఇప్పటికైనా మురుగు కాల్వలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మండపేట మండలం కేశవరంలో ఎర్రకాల్వ గట్టుపై కొండను తలపిస్తున్న చెత్త



పెదపళ్ల బాలగణపతి ఆలయంలో స్వామివారు

వైభవంగా సంకటహర చతుర్థి

ఆలమూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాఘమాసం సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం మండలంలో గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. పెదపళ్ల బాలగణపతి, చింతలూరు లక్ష్మిగణపతి, ఆలమూరు గణపతి ఆలయాలతోపాటు పలు గ్రామాల్లో స్వామివారికి సంకటహర చతుర్థి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



విజయదుర్గా పీఠంలో సూర్య భగవానుడికి హోమం చేస్తున్న దృశ్యం

పీఠంలో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు

రాయవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో మాఘమాసం మూడవ ఆదివారాన్ని పురస్కరించుకుని సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠం అర్చకుడు శివ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, వివిధ రకాల పుష్పాలతో అర్చనలు, అరుణ పారాయణం జరిపారు. అనంతరం సూర్య భగవానుడికి హోమం, పూర్ణాహుతి జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడిని పూజించడం వల్ల ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి దంపతులు, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

మండపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) మండపేట మండలం అర్తమూరు గ్రామంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్‌బిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ట్రస్టు మహిళా విభాగపు సభ్యురాలు సత్తి శ్రీదేవి ప్రారంభించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ట్రస్టు నిర్వాహకులు బుల్లి స్వామిరెడ్డిని పలువురు అభినందించారు. హోమియో వైద్యం వల్ల కలిగే ప్రయోజనాలను రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో వైద్యులు తెలిపారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో అనపర్తి, రాయవరంనకు చెందిన వైద్యులతోపాటు అల్లు రామలింగయ్య హోమియో వైద్యులు సాయిసుధా ఐశ్వర్య, వీరభద్రరావు తదితరులు సేవలను అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

రావులపాలెం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చిలకమర్తి మౌనికకు ఆర్థికసాయం అందించారు. స్థానిక వాసవీ క్లబ్, పులవర్తి ఎడ్యుకేషనల్ ట్రస్టు అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణమూర్తి ఆదివారం ట్రస్టు భవనంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థికి రూ.6 వేలు అందించారు.

డాబాపై నుంచి పడి వ్యక్తి మృతి

పి.గన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు డాబాపై నుంచి వ్యక్తి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. వైవీపాలేనికి చెందిన యర్రంశెట్టి వీరస్వామినాయుడు(55) కూరగాయల వ్యవసాయం చేసుకుంటూ కొంత కాలంగా పి.గన్నవరం శివాలయం సమీపంలో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం టీవీ చానళ్లకు సంబంధించిన డిష్ పనిచేయక పోవడంతో డాబాపై మరమ్మతులు చేయిస్తున్నాడు. ఆ సమయంలో చెత్తను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు డాబాపై నుంచి క్రింద పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.